క్లుప్తంగా

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం

సామర్లకోట: స్థానిక బోనాసు వారి వీధిలోని పీబీసీ కాలువ గట్టుపై ఉన్న విశాలాక్షీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయంలో కార్తిక మాసోత్సవాలు ముగిసిన సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాజశ్యామల యాగం


పిఠాపురంలో రాజశ్యామల యాగం నిర్వహిస్తున్న పండితులు

పిఠాపురం: బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో ఆదివారం శ్రీరుద్ర సహస్ర చండీ సహిత రాజశ్యామల యాగం కన్నుల పండువగా నిర్వహించారు. లోక కల్యాణార్థం రాష్ట్ర శ్రేయస్సు కోరుతూ ఈ యాగం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, శ్రీచక్ర లలితా సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం సోమవారం జరిగే సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలకు వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ సూచించారు. తాటిపర్తిలో షష్ఠ ఉత్సవాల బందోబస్తును ఆదివారం ఆయన పర్యవేక్షించారు. మండలంలోని తాటిపర్తి, మల్లవరం తదితర ప్రాంతాల్లో 12 మంది ఎస్సైలు 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 1.50 లక్షల మంది భక్తులు ఉత్సవాలకు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని ఆయన కోరారు.

పంచారామ క్షేత్రంలో నేడు షష్ఠి వేడుకలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం షష్ఠి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరణ ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏపీఈపీడీసీఎల్ ప్రభాకర్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

జూదరుల అరెస్టు

సామర్లకోట: స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సీఐ డి సురేష్ ఆధ్వర్యంలో దాడి చేసి ఏడుగురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,390 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా గంధోత్సవం

పెద్దాపురం: ముస్లిం, మైనార్టీ సోదరుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక కవాడి వీధి జండా జంక్షన్‌లోని హజరత్ మహబూబ్ సుభాని జెండా గంధోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అధ్యక్షతన జరిగిన వేడుకలో దొరబాబు మాట్లాడుతూ ముస్లింల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వార్డు కౌన్సిలర్ సయ్యద్ అమీనా బీబీలతో కలిసి వస్త్రదానం చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

శరవణ భవ..!

- నేడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి
- సుందరంగా ముస్తాబైన ఆలయాలు
- తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, దర్శనం

పిఠాపురం: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలంలో తాటిపర్తి, మల్లవరం, చేబ్రోలు, గొల్లప్రోలులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. తాటిపర్తి, మల్లవరంలో స్వామివారి ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

పెళ్లి కుమారుడిగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, కుమార్తెగా అలంకరించి ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాలు పోసుకునేందుకు వీలుగా ఆలయ ప్రాంగణంలో పుట్టలు ఏర్పాటు చేశారు.

సిద్ధమైన ఉగ్రషష్ఠి మండపాలు

స్వామివారి ఉగ్రషష్ఠి మండపంలో నిద్రిస్తే సంతానం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం. ఇది వందల ఏళ్లుగా కొనసాగుతోంది. ఏటా వందల సంఖ్యలో పెళ్లైన మహిళలు సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిద్ర చేస్తుంటారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉగ్రషష్ఠి మండపంలో భక్తులు ఉపవాస దీక్షలు చేశారు. ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం ఎక్కువగా ఉగ్రషష్ఠి మండపాలు సిద్ధం చేశారు.


పెళ్లి కొడుకు అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

పుట్టలు సిద్ధం

పిఠాపురం: నాగుల చవితి నాడు భక్తులు పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి సుబ్రహ్మణ్యస్వామికి పాలు పోస్తారు. అయితే షష్ఠ ఉత్సవాల్లో మాత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుట్టల్లో భక్తులు పాలు పోసి పూజలు చేస్తారు. సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఏకే మల్లవరం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పుట్టలు సిద్ధం చేశారు. వందల సంఖ్యలో భక్తులు వీటిలో పాలు, గుడ్లు వేసి పూజలు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు.


ఏకే మల్లవరంలో షష్ఠి ఉత్సవాలకు సిద్ధమైన స్వామివారి ఆలయం


తాటిపర్తిలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలను పురస్కరించుకుని తాటిపర్తిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంటోంది.


గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో సిద్ధం చేసిన పుట్టలు


తాటిపర్తి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

ఇక్కడ నిద్రిస్తే సంతాన ప్రాప్తి


తాటిపర్తి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సిద్ధమైన ఉగ్ర మండపాలు


ఉగ్ర మండపంలో నిద్రిస్తున్న మహిళలు (ఫైల్)

- షష్ఠి వేడుకల్లో వింత ఆచారం
- ఏటా ఉగ్ర మండపాల్లో నిద్ర చేస్తున్న మహిళలు
- గొల్లప్రోలు మండలంలోని ఆలయాల వద్ద ఉగ్ర మండపాలు సిద్ధం

పిఠాపురం: తల్లి అనిపించుకోవాలని ప్రతీ మహిళా ఆరాట పడుతుంది. ఐదోతనంతో పాటు మాతృమూర్తిగా మారడానికి మహిళలు పడే కష్టం అంతా ఇంతా కాదు. చేయని పూజలు ఉండవు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు చేసే పూజల్లో ఓ వింత ఆచారం గొల్లప్రోలు మండలంలోని షష్ఠ ఉత్సవాల్లో ఏటా కనిపిస్తోంది. ఇక్కడ షష్ఠ ఉత్సవాల ప్రారంభం రోజున ఆలయాల చుట్టు ప్రత్యేకంగా నిర్మించిన తాటాకు మండపాల్లో ఎర్రని చీరలు ధరించి మహిళలు నిద్ర పోతారు. ఆలయంలో అసలు నిద్ర పోవడమే తప్పుగా భావించే భక్తులు ఇక్కడ మాత్రం కావాలని మరీ నిద్ర పోతుంటారు. శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠ మహోత్సలకు పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలంలో ఓ ప్రత్యేకత ఉంది. మండలంలోని తాటిపర్తి, మల్లవరం, చేబ్రోలు, గొల్లప్రోలులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో షష్ఠి ఉత్సవాల ప్రారంభం రోజున నిద్రపోతే సంతానం కలుగుతుందనే భక్తుల విశ్వాసం. కొత్తగా పెళ్లయిన వారు, పిల్లలు పుట్టని మహిళలు తమకు సంతాన ప్రాప్తి కలగాలని కోరుతు ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉగ్రషష్ఠ మండపాల్లో షష్ఠ రోజు రాత్రి నిద్ర పోతారు. కాగా ఇక్కడ పోవడానికి వందల సంఖ్యలో మహిళలు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరుకుంటారు.

వందల ఏళ్లుగా...

స్వామివారి ఉగ్రషష్ఠ మండపంలో నిద్రిస్తే సంతానం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం. ఇది వందల ఏళ్లుగా కొనసాగుతోంది. ఏటా వందల సంఖ్యలో మహిళలు సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిద్ర చేస్తుంటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు షష్ఠ ముందు రోజు రాత్రికే ఆలయాలకు చేరుకుంటారు. అర్ధరాత్రి నుంచి ఉగ్రషష్ఠ మండపంలో ఉపవాస దీక్ష చేసేందుకు సిద్ధమవుతారు. భక్తులు సౌకర్యార్థం ఉగ్రషష్ఠ మండపాలు సిద్ధం చేశాం.

ఆకొండి ప్రభాకరశాస్త్రి, ఆలయ అర్చకులు, అపర్ణాదేవి ఆలయం, తాటిపర్తి

వారు ఫార్టీస్.. అయ్యారు ట్వంటీస్..


మహారాణి కళాశాల బీకాం 2000-2003 పూర్వ విద్యార్థులు

- ఆత్మీయంగా కలసిన పూర్వ విద్యార్థులు
- అల్లర్లతో.. సరదాలతో.. సందడిగా సాగిన మిత్రుల సమాగమం

పెద్దాపురం: వారు బీకాం చదివారని కామ్‌గా ఉంటారనుకునేరు..! అమ్మో నేటి కుర్రాళ్లకేమీ తీసిపోరు. ప్రస్తుతం ఫార్టీస్‌లో ఉన్నా.. ఇదిగో వారంతా కలిసేటప్పటికి ట్వంటీస్‌కి దిగొచ్చేశారు. ఆ పెద్దరికం కాస్తా కుర్రతనంగా మారిపోయింది. నాటి స్నేహ బంధాలు, అల్లరి, చిలిపి పనులు, నిక్‌నేమ్‌లతో పిలుచుకోవడాలు.. అప్పటి రోమియో పనులు అబ్బో.. ఒకటేమిటి చాలా అల్లర్లకి వేదికైంది స్థానిక ముప్పన రామారావు గాలి బంగ్లా. 2000–03 బ్యాచ్ మహారాణి కళాశాల బీకాం బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆ బంగ్లాలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు బాలు, శంకర్, జగదీష్, రాజు, జ్యోతికుమార్, శ్రీను, ప్రసాద్, వీరు తదితరుల ఆధ్వర్యంలో వారంతా ఒకటయ్యారు. వివిధ హోదాల్లో పనిచేస్తూ జీవితంలో తమకంటూ ఓ గుర్తింపును దక్కించుకున్న వారందరూ నాటి రోజుల్లోకి వెళ్లిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. నాటి అల్లర్లను, చిలిపి తగాదాలను గుర్తుచేసుకుంటూ ఎంతో హృద్యంగా గడిపారు. గుంపులు గుంపులుగా.. అంతలోనే సామూహికంగా.. మళ్లీ ఒకరొకరుగా అందరూ ఒకరుగా మొత్తానికి అందరూ ఆహ్లాద కరమైన వాతావరణంలో గడిపారు.

మానవాళికి మార్గదర్శి ఏసు

- ఉజ్జీవ ప్రసంగీకులు మంగాచార్యులు
- ఘనంగా సీజీఎం వార్షికోత్సవం


సీజీఎం సేవలపై వివరిస్తున్న శామ్యూల్ సుదీప్

పెద్దాపురం: మండలంలోని తిరుపతి క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) 11వ వార్షికోత్సవం, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం సువార్త సంగీత క్రిస్మస్ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ ట్రస్టీ నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో స్థానిక చర్చి సమీపంలోని మైదాన ప్రాంగణంలో తిరుపతి గ్రామ పరిసర, ఏజెన్సీ ప్రాంతాల విశ్వాసులతో క్రిస్మస్ ఆరాధన నిర్వహించారు. కృష్ణాజిల్లా పెదలంక ఉజ్జీవ ప్రసంగీకుడు, హోలీ టీమ్ డైరెక్టర్, ప్రముఖ దైవజనుడు జాన్ మంగాచార్యులు మాట్లాడుతూ సర్వమానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువేనన్నారు. అనంతరం క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవజనుడు, సీజీఎం గౌరవాధ్యక్షుడు నంగిన సత్యానందం, శాంతకుమారి దంపతులు, సీజీఎం బృందం భారీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేయగా ప్రముఖ అంతర్జాతీయ గాయకులు సునీలు, సుజాత, నజరేష్ ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్స్ వంకా జాన్, అభిషేక్, జయకుమార్, కిషోర్‌కుమార్, జేమ్స్, బ్లెస్సింగ్, శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

- ప్రభుత్వంపై బురద జల్లే ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాల్సిందే
- సామాజిక మాధ్యమాల్లో వాస్తవాలు చెప్పండి
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి


సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: ప్రభుత్వంపై బురద జల్లే ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందని, యువత ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను సామాజిక మాధ్యమాల ద్వారా తిప్పికొట్టాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేద్కర్ భవనంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ, మండల ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పార్టీ నేతలు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారాలకు దీటుగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు సమాధానం చెప్పి, వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పార్టీని మరింతగా ప్రజల ముందుకు తీసుకువెళ్లి 2024 ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, ఎలిశెట్టి నరేష్, సోషల్ మీడియా కాకినాడ జిల్లా ప్రతినిధి ఎంజీకే రాజు, పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

- ఆరో వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం
- పథకాల లబ్ధిని వివరించిన దొరబాబు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని దీనిలో భాగంగానే ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించడానికి ఆరో వార్డులో వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. అవ్వా, తాతలను కలసి పింఛన్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉంటే సచివాలయ సిబ్బంది పథకాలకు ఎంపిక చేస్తారని అన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న వలంటీరు వ్యవస్థను రద్దు చేయాలని టీడీపీ నాయకులు కోర్టును ఆశ్రయించారని అవ్వాతాతకు దొరబాబు వివరించారు. ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. పథకాలు అందని వారిని, మధ్యలో నిలిచిపోయిన వారిని గుర్తించి అర్హులకు పథకాలు అందేలా చేయడానికి అధికారులను కార్యక్రమంలో భాగస్వామ్యులను చేసినట్టు తెలిపారు. సంక్షేమ పథకాలు అందాలంటే గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, సచివాలయ సిబ్బందే ప్రజల వద్దకు వచ్చే ఏర్పాటు జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. అటువంటి వ్యక్తిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, మర్రి శేషారావు, నేతల హరిబాబు, పాలిక కుసుమ, పాగా సురేష్‌కుమార్, యార్లగడ్డ జగదీశ్వరరావు, వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, రెడ్డం దొరబాబు, మాగాపు గోపి, లక్ష్మీ సత్యనారాయణ, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోధ్య రామ మందిర అక్షతల పంపిణీ


అక్షతలు, కరపత్రాలను ఆయా గ్రామాల ఆధ్యాత్మిక కార్యకర్తలకు అందజేసిన వీహెచ్‌పీ నాయకులు

సామర్లకోట: అయోధ్య రామ మందిరంలో పూజలు చేసిన అక్షతలు ఆదివారం విశ్వహిందూ పరిషత్ నాయకులు పంపిణీ చేశారు. స్థానిక మఠం సెంటర్‌లోని రామాలయంలో మండల పరిధిలోని 20 గ్రామాలకు అయోధ్యరాముని అక్షింతలు, చిత్రపటాలు, కరపత్రాలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని ప్రతి ఇంటికీ అక్షింతలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అయోధ్య రామ మందిరం కమిటీ సభ్యులు కర్రి ఆదినారాయణరెడ్డి, బిక్కిన రాజు, కేదారిశెట్టి సుబ్బారావు, అర్జునరావు, అలకంటి చంటిబాబు తెలిపారు. జనవరి ఒకటి నుంచి ఏడో తేదీ లోపుగా ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీబీ దేవం శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి ఉపాధ్యక్షుడు అచంట సత్యనారాయణ, సమితి సభ్యుడు తోటకూర ప్రభాకరరావు, వేట్లపాలెం రామకృష్ణ సేవాసమితి సభ్యుడు మోరంపూడి వెంకటేశ్వరరావు, వల్లూరి వీరభద్రరావు, కంటిపూడి గోపాలకృష్ణ, బలరాం పాల్గొన్నారు. ఆయా గ్రామాలకు ఊరేగింపుగా అయోధ్యరామ మందిరం నుంచి వచ్చి పవిత్రమైన అక్షింతలు, కరపత్రాలను ఆయా గ్రామాల్లోని రామాలయాలకు తీసుకువెళ్లి భద్రపరిచారు.

తీరంలో పర్యాటకుల సందడి


సాగర తీరంలో పర్యాటకుల సందడి

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కొత్తపల్లి మండలంలోని గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. ఉదయం తుని సమీపంలోని తలుపులమ్మతల్లి లోవ దేవస్థానాన్ని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్రపు స్నానాలు చేశారు. సముద్ర కెరటాల మధ్య యువకులు చేసిన పిరమిడ్ విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కాగా తీరంలో వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు నీరు అందుబాటులో లేక పర్యాటకులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

మోగిన నెలగంట

తుని రూరల్: సంక్రాంతి వేడుకలకు సూచికగా గ్రామాల్లో వివిధ ఆలయాల్లో నెలగంట మోగించారు. ఆదివారం తెల్లవారుజామున ఎస్.అన్నవరం, కేఓ.మల్లవరం, చామవరం, హంసవరం, తేటగుంట, డి.పోలవరం, ఎస్.సూరవరం, వి.కొత్తూరు, వల్లూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో నెలగంట మోగించారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు ధనుర్మాస ప్రారంభ పూజలు చేశారు. స్వామివారికి హోమం నిర్వహించారు.

ప్రజా బలంతో ఉన్న పార్టీ వైఎస్సార్ సీపీ

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి
- జనసేన, టీడీపీ నుంచి 100 కుటుంబాల చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి దొరబాబు తదితరులు

సామర్లకోట: ప్రజా బలంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలం వీకే రాయపురంలో జనసేన, టీడీపీకి చెందిన 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిన సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పాలన చూసి అనేక మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తిరిగి ఎన్నికలకు వెళుతున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న ఆయన జీవిత కాలం సీఎంగా ఉండాలని ప్రజలు కోరుకొంటున్నారని దొరబాబు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ దవులూరికి సీఎం జగన్ మొదటి టిక్కెట్టు ప్రకటించడంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు జ్యోతుల అబ్బాయి, మోర్త చిన్నా, వాసంశెట్టి శ్రీరాములు, చుక్కా బుజ్జి, ఇజ్జిన ప్రసాద్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, జనసేనకు చెందిన అముదాల దొరబాబు, అడపా శ్రీను, చింతంరెడ్డి సంజీవి, ప్రసాద్, కసిరెడ్డి చినబుజ్జిల ఆధ్వర్యంలో 50 కుటుంబాలు పార్టీలో చేరగా వారికి దవులూరి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, సర్పంచ్ మోర్త పూర్ణిమ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, ఎలిశెట్టి నరేష్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు పాల్గొన్నారు.